సాక్షి చిత్తూరు

సోమవారం ¦ 13 ¦ మార్చి ¦ 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.52,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,000
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.64,000
రిటైల్ వెండి గ్రాము	రూ.66

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	15
తిరుపతి	36	20
తిరుమల	32	16
గూడూరు	35	22
నగరి	37	21

అమ్మవారి సేవలో లయ



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం ప్రముఖ సినీ నటి లయ దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీసెట్‌లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజక వర్గ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈనెల 16న జరుగుతుందని చెప్పారు. ఈనెల 13న పోలింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోని తాత్కాలిక స్ట్రాంగ్ రూముల్లో భారీ బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరుస్తామని తెలిపారు. అనంతరం కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని చెప్పారు. జేసీ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీవో రేణుక, రిటైర్డ్ ఏజేసీ వీఆర్ చంద్ర మౌళి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని దర్శనానికి 4 గంటలు



భక్తులతో నిండిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. రెండో శనివారం సెలవు సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడిన విషయం తెలిసిందే. ఆదివారం కూడా పలు ప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా తరలి వచ్చారు. క్యూలు, కంపార్ట్‌మెంట్‌లు భక్తులతో నిండి పోయాయి. దర్శనానికి 4 గంటల సమయం పట్టింది. భక్తులు త్వరితగతిన దర్శనం చేసుకునేలా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తగు చర్యలు తీసుకున్నారు.

నులి పురుగుల నివారణ దినోత్సవం రేపు

- 35,5147 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ సుదర్శన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 5,295 అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కార్యక్రమం అమలవుతుందన్నారు. మొత్తం 35, 5147 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. 1-2 వయస్సు పిల్లలకు 200 ఎంజీ(అర్ధమాత్ర), 2-19 ఏళ్ల పిల్లలకు 400 ఎంజీ (ఒక మాత్ర) ఇస్తారని పేర్కొన్నారు. భోజనం తరువాత అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాలల ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు ఈ మాత్రను పిల్లలకు మింగించాలని సూచించారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



పూర్ణాహుతి పూజల్లో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మూడు రోజుల లక్ష కుంకుమార్చన ఆదివారం ఘనంగా ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన చేపట్టారు. మూడు రోజులు జరిగిన పూజల్లో 1,550 మంది దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం మహా పూర్ణాహుతితో లక్ష కుంకుమార్చన ముగిసింది. తర్వాత కలశ జలాలతో సంప్రోక్షణ చేశారు. మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, వైఎస్సార్ సీపీ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, ఎం.హరినాథ్‌రెడ్డి, టి.రమణమ్మ, పి.ధనశేఖర్, వి.క్రిష్ణమ్మ, ఎస్.భారతి పాల్గొన్నారు.

నేడు స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ హరి నారాయణన్ ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కారణంగా స్పందన రద్దు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. వ్యయప్రయాసలకు ఓర్చి జిల్లా కేంద్రానికి రావద్దని కలెక్టర్ సూచించారు.



పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్



పోలింగ్ కేంద్రాల బందోబస్తుకు పోలీసులు ..

నేడే మండలి పోరు

- పటిష్ట బందోబస్తు నడుమ కేంద్రాలకు సామగ్రి
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- పట్టభద్రులకు 22 మంది, ఉపాధ్యాయ ఎన్నికలకు 8 మంది పోటీ
- ఏర్పాట్లు పర్యవేక్షించిన యంత్రాంగం

సాక్షి, తిరుపతి/చిత్తూరు కలెక్టరేట్ : తూర్పు రాయలసీమ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గాలకు సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టభద్రులకు 22 మంది, ఉపాధ్యాయ ఎన్నికలకు 8 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. భారీ సైజు బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్‌లను ఉపయోగించి పోలింగ్ నిర్వహిస్తున్నారు. వీడియో నిఘాలో పోలింగ్ నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

అయా జిల్లాల పరిధిలోని ఎస్పీల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఐదుగురు సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారు. పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలోని కేంద్రాలకు పోలింగ్ సామగ్రితో సిబ్బంది చేరుకున్నట్లు వివరించారు. ఈనెల 16న ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ జరగనుంది.

అభ్యర్థులు వీరే

పట్టభద్రుల ఎన్నికలకు: శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి (వైఎస్సార్ సీపీ), కంచర్ల శ్రీకాంత్ (టీడీపీ), సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి (బీజేపీ), ఇండిపెండెంట్లుగా అప్పంగారి జైపాల్, అంకయ్య చౌదరి, కమ్మిశెట్టి భాస్కర్‌రావు, కరుణానిధి చిరిపిరెడ్డి, కిరణ్‌దశరన్న మట్టిగుంట, కొమ్ము యోహాను, గుళ్లాపల్లి వీరభద్రాచారి, దొడ్ల శ్రీహరి, నక్కా దినేష్, నీలం సామ్యేల్ మోజస్, పళ్లిపట్టు అభినవ్ విష్ణు, పూసలరవి, పంతంగి పాలంకరెడ్డి, బుస్సారాజేంద్ర, బొట్టికాయల చంద్రశేఖర్, మహేంద్రరెడ్డి, మాదాసి జాలారావు, మీగడ వెంకటేశ్వరరెడ్డి, సరిత పోటీలో ఉన్నారు.

ఉపాధ్యాయ ఎన్నికలకు: చంద్రశేఖర్‌రెడ్డి పర్వతరెడ్డి, కుట్టుబోయిన బ్రహ్మానందం, గుర్రం శ్రీరామమూర్తి, ధనుంజయ శివయోగి, ప్రవీణ పర్వతరెడ్డి, బాబు రెడ్డి పొక్కిరెడ్డి, ఎల్‌సీ రమణారెడ్డి, లక్కు అనసూయ పోటీ చేస్తున్నారు.

తొలి ప్రాధాన్యత ఇస్తేనే ఓటు చెల్లుబాటు

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రాధాన్యత ఓటు విధానంలో నిర్వహిస్తారు. ఓటర్లు తమ తొలి ప్రాధాన్యత ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఓటు చెల్లుబాటు కాదు. ఓటింగ్‌కు సంబంధించి అధికారులు కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు. అవి ఇలా..

- పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రంతో పాటు ఇచ్చిన ఊదా (వయోలెట్) రంగు స్కెచ్ పెన్‌తో మాత్రమే ఓటు వేయాలి.
- ఓటరు తాను మొదటి ప్రాధాన్యత ఇవ్వదలచుకున్న అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న ఖాళీ గడిలో '1'అంకెను రాయాలి.
- ప్రాధాన్యతలను తెలిపేందుకు అంతర్జాతీయ ప్రామాణిక అంకెలు 1, 2, 3, 4... లేదా రోమన్ అంకెలు లేదా భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్ గుర్తించిన ఇతర భారతీయ భాషల్లో ఉపయోగించే అంకెలను వినియోగించవచ్చు.
- ఒకే సంఖ్యను ఒక అభ్యర్థి కన్నా ఎక్కువ మందికి ఇవ్వకూడదు.
- బ్యాలెట్ పత్రంపై ఓటర్లు తమ ఇంటి పేరు, ఇతర పదాలు, సంతకం, పొడి అక్షరాలు రాయకూడదు. వేలిముద్రలు కూడా వేయకూడదు.
- ఓ క్రమపద్ధతిలో మడతపెట్టిన బ్యాలెట్ పత్రాన్ని బాక్సులో వేయాలి.



పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

ఎన్నికల సమాచారం ఇలా...

పోలింగ్ జరగనున్న జిల్లాలు: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు

మొత్తం పట్టభద్రుల ఓటర్లు	3,81,181
పురుషులు	2,45,866
మహిళలు	1,35,284
ఇతరులు	31
బరిలో ఉన్న అభ్యర్థులు	22
పోలింగ్ కేంద్రాలు	453
మొత్తం ఉపాధ్యాయ ఓటర్లు	27,694
పురుషులు	16,825
మహిళలు	10,869
బరిలో ఉన్న అభ్యర్థులు	08
పోలింగ్ కేంద్రాలు	176

ఈ గుర్తింపు కార్డుల్లో ఏదున్నా ఓకే

ఓటు హక్కు వినియోగించుకునేవారు పది గుర్తింపు కార్డుల్లో ఏవైనా చూపొచ్చని రిటర్నింగ్ అధికారి హరి నారాయణన్ తెలిపారు. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు జారీచేసిన సర్వీస్ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధికారిక గుర్తింపు కార్డు, విద్యాసంస్థలు జారీచేసిన సర్వీస్ గుర్తింపు కార్డు, విశ్వవిద్యాలయాలు జారీచేసిన డిగ్రీ/డిప్లొమా ఒరిజనల్ ధ్రువపత్రం, దివ్యాంగులు ధ్రువపత్రం, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ జారీచేసిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల్లో దేన్నయినా చూపించవచ్చు.

పోలింగ్ కేంద్రాలు ఇలా..

పట్టభద్రుల ఎన్నికలకు చిత్తూరు జిల్లాలో 69, తిరుపతి జిల్లాలో 101 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎన్నికలకు చిత్తూరు జిల్లాలో 31, తిరుపతి జిల్లాలో 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

"ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాం. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాం. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఓటు ఎలా వేయాలి అనే అంశంపై ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అవగాహన బ్యానర్ ఏర్పాటు చేశాం. భారీ పోలీసు బందోబస్తు కల్పించాం. **– హరినారాయణన్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్, చిత్తూరు**

సవాళ్లను ఎదుర్కొనే దమ్ము లేదా లోకేష్?



కేక్ కట్ చేసి టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్‌కు తినిపిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పార్టీ సీనియర్ నాయకులు ఎంఆర్‌సీ.రెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: 'సవాళ్లను ఎదుర్కొనే దమ్ము లేనప్పుడు సవాళ్లు చేయకూడదు లోకేష్' అని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హితవు పలికారు. తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ఎంఆర్‌సీ.రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇదే తరహాలో పాలన సాగించి వందేళ్లు పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్తేజం కలుగుతోందన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి అందించిన స్లిప్‌లు చదివి సవాళ్లు చేసిన లోకేష్‌కు ప్రతిసవాళ్లను ఎదుర్కొనే దమ్ము లేదా? అని ప్రశ్నించారు. లోకేష్ సవాళ్లకు ఎంపీ మిథున్‌రెడ్డి సిద్ధమైతే లోకేష్ మెల్లగా జారుకోవడం చేతకానితనమే అవుతుందన్నారు. పశ్చిమ, తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు వైఎస్సార్‌సీపీవేనని ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



తిరుపతి: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి



నగరి: ఆవిర్భావ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

చిత్తూరు కార్పొరేషన్: యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ)13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లాలో ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల్లో ఆవిర్భావ వేడుకలు చేసుకున్నారు.

తిరుపతి జిల్లాలో..

తిరుపతి: నగరంలోని మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే అని ధీమా వ్యక్తం చేశారు.

వెంకటగిరి: వెంకటగిరిలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే కె.సంజీవయ్య ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి వేడుకలు నిర్వహించారు.

చంద్రగిరి: చంద్రగిరిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

చిత్తూరు జిల్లాలో..

నగరి: నగరి పట్టణంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయం, వడమాలపేట మండలంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని క్రీడలు, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో మహానేత వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జెండా ప్రతిపక్షాల గుండెల్లో వణుకు పుట్టిస్తోందని మంత్రి అన్నారు.

పూతలపట్టు: పూతలపట్టు, బంగారుపాళెం మండలాల్లో ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన కేక్‌ను కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. రానున్న రోజుల్లో పార్టీ పై అభిమానం ప్రజలు ఇలానే కొనసాగించాలని కోరారు.

పుంగనూరు: పుంగనూరులో రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాయలసీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జి ఫక్రుద్దీన్ షరీఫ్ నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

జీడీనెల్లూరు: కార్వేటినగరంలో మండల కన్వీనర్ ధనంజయశర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పలమనేరు: పట్టణంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు చేశారు.

ధూమపానం.. ప్రాణాంతకం



తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్ 'ధూమపానంతో ఆరోగ్యం క్షీణిస్తుంది' అనే అంశంపై సముద్ర తీరంలో ఆదివారం సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పానికి 'స్మోకింగ్ కిల్స్' అనే ట్యాగ్ లైన్ ఏర్పాటు చేశారు. 'ప్రపంచ నో స్మోకింగ్ డే' సందర్భంగా రూపొందించిన ఈ సైకత శిల్పం ఆకట్టుకుంది. – చిల్లకూరు

ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్

రామకుప్పం: అనంతపురం రేంజ్ పరిధిలో జరుగుతున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేసినట్లు అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ తెలిపారు. ఆదివారం ఆయన రామకుప్పం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి చోటా స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను నియమించినట్లు తెలిపారు.పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను తరలించేందుకు మొబైల్ ఫోర్సులను నియమిస్తామన్నారు. చిత్తూరు స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో విశ్వాసం నెలకొల్పేందుకే పోలీస్‌స్టేషను తనిఖీ చేసి స్థానిక అధికారులకు, సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా మొబైల్ ఫోన్‌లకు వచ్చే అపరిచిత లింక్‌లను ఓపెన్ చేయకూడదని సూచించారు. అక్రమ రవాణాను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులకు మహిళా పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. రామకుప్పం పోలీస్‌స్టేషనులో రికార్డులు, కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసుల దర్యాప్తు తీసుకోవాల్సిన అంశాలపై డీఐజీ సూచనలిచ్చారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి, కుప్పం రూరల్ సీఐ రియాజ్ అహ్మద్, డీటీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శరత్‌చంద్ర, ఎస్‌ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ రవిప్రకాష్

క్లుప్తంగా

ఉన్నత విద్యపై అవగాహన

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన ముఖ్యమని నారాయణ కళాశాల డీజీఎం కొండలరావు అన్నారు. ఆదివారం స్థానిక గిరింపేటలో ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఉన్నత విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఎటువంటి కోర్సులు తీసుకుంటే భవిష్యత్తు బాగుంటుందనే అంశంపై అవగాహన కల్పించారు. వివిధ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

భూ కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని బోడి కొండలో రూ. కోట్ల విలువజేసే 10 ఎకరాల భూమి ఆక్రమణకు గురవుతున్నట్లు శనివారం స్థానికులు కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ పార్వతి ఆ ప్రాంతానికి వెళ్లి చదును పనులను నిలుపుదల చేయించారు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని ఆమె పేర్కొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణానికి చెందిన బాలికను గర్భవతిని చేసిన కేసులో నిందితుడు మిథున్‌ను ఇన్‌చార్జి డీఎస్పీ రామరాజు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తికి చెందిన నిందితుడు మిథున్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుడు పుత్తూరు పున్నమి సర్కిల్ వద్ద సంచరిస్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

పుత్తూరులో స్కేటింగ్ రింగ్ ఏర్పాటు

- క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా
- వేద నరసింహకు వజ్రా వరల్డ్ రికార్డు ప్రదానం
- రోజా ట్రస్ట్ తరఫున రూ.లక్ష ప్రోత్సాహక బహుమతి



వేదనరసింహకు అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలో త్వరలోనే స్కేటింగ్ రింగ్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా ప్రకటించారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని, టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆదివారం స్థానిక గేట్‌పుత్తూరులో జరిగిన కార్యక్రమంలో ఏర్పేడు నుంచి గూడూరు వరకు 270 కిలో మీటర్లు నాన్‌స్టాప్ స్కేటింగ్ చేసి వరల్డ్ రికార్డు సాధించిన కె.వేదనరసింహ(9)కు మంత్రి రోజా వజ్రా వరల్డ్ రికార్డు, గ్లోబల్ ఏషియన్ ఫసిఫిక్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న వారికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లల ఆసక్తిని బట్టి ఆదిశగా ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని చెప్పారు. గతంలో పుత్తూరుకు చెందిన వెనిష్కశ్రీ 250 కిలో మీటర్లు స్కేటింగ్, భారతీరాజా కళ్లకు గంతలు కట్టుకుని 150 కిలో మీటర్లు స్కేటింగ్ ద్వారా రికార్డులు సాధించారని గుర్తు చేశారు. ఈ రికార్డులను బ్రేక్ చేస్తూ వజ్రా వరల్డ్ రికార్డు సాధించిన వేదనరసింహకు తన రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.లక్ష ప్రోత్సాహక బహుమతిని అందజేయనున్నట్లు ప్రకటించారు. గత క్రీడాకారులకు సైతం తన ట్రస్ట్ ద్వారా సహకారం అందించినట్లు తెలిపారు. వేదనరసింహ రికార్డు నెలకొల్పడంలో చొరవ చూపిన కోచ్ ప్రతాప్‌ను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో వజ్రా వరల్డ్ రికార్డు సీఈఓ తిరుపతిరావు, గ్లోబల్ ఏషియన్ ఫసిఫిక్ ప్రతినిధి మురగానందం, మున్సిపల్ వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో విజయేంద్రరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్య పాఠశాలల్లో తరగతులు నిర్వహించకూడదని హెచ్చరించారు.

వైభవంగా బాటగంగమ్మ జాతర



అమ్మవారి సేవలో ఎంపీ రెడ్డెప్ప, అన్నదాన కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి అభినయ్‌రెడ్డి

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె బాటగంగమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారి శిరస్సును సర్వాంగ సుందరంగా అలంకరించి శనివారం రాత్రి పుర వీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం ఆలయం వద్ద కొలువుదీర్చారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని ఎంపీ ఎన్.రెడ్డెప్ప, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, జానపదకళల కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి తదితరులు దర్శించుకున్నారు. డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి విదేశీ వైద్యుల ఆహ్వానం


ఆస్పత్రి ప్రారంభోత్సవానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానిస్తున్న విదేశీ వైద్యులు

తిరుపతి మంగళం : చిత్తూరు నియోజకవర్గంలోని గుడిపాల మండలంలో నూతనంగా నిర్మించిన ఎస్టీ పాయుల్స్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి రాష్ట్ర అటవీ, విద్యుత్, గనుల శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విదేశీ వైద్యులు ఆహ్వానించారు. తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి కార్యాలయంలో ఆదివారం డాక్టర్ పన్నీర్‌సెల్వమ్, యోగలతతో పాటు అమెరికన్ వైద్యులు మంత్రి పెద్దిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపి, వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

సూళ్లూరుపేట : తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కొంత మంది బెడ్‌షీట్లు అమ్ముకునే వారిలా రైళ్లలో గంజాయిని తీసుకొచ్చి సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు చేర్చగా.. తమిళనాడుకు చెందిన మరికొంతమంది బెడ్‌షీట్లు కొనుగోలు చేసినట్టుగా నటించి ఆ గంజాయిని తీసుకుని వెళుతున్నారని తెలిపారు. ఈ తరహాలో పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను రైల్వేస్టేషన్ రోడ్డులో అరెస్టు చేసినట్లు వివరించారు. వారి నుంచి రూ.3.84 లక్షలు విలువ చేసే 12 కిలోల గంజాయి, 8 మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ముఠాలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఐదుగురు, తమిళనాడుకు చెందిన ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నట్లు వివరించారు. ఆదివారం పట్టుబడిన ముఠాలో అల్లూరుసీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం, లోతుగడ్డ ప్రాంతానికి చెందిన చెందిన మొహమ్మద్ బరీద్ (42), గూడెం కొత్తపల్లి మండలం, దేవరపల్లెకు చెందిన సప్రబార్ సాదిక్ (40) 12కిలోల గంజాయిని తీసుకొచ్చి రైల్వేస్టేషన్‌లో రోడ్డులోని పోస్టాఫీస్ వద్ద ఎదురు చూస్తుండగా, తమిళనాడులోని చెంగల్పట్‌కు చెందిన మారియప్పన్ (42), చెన్నైకు చెందిన కన్మణి (28), ఏ రమణి (26), మణిమేఘలై (32), శివకుమార్(24) వచ్చి వారితో బేరం కదుర్చుకునే సమయంలో పోలీసులు దాడులు చేసి, అందరినీ అక్కడికక్కడే అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరిని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్‌ఐలు రవిబాబు, జేసీ శ్రీనివాసులురెడ్డి, ఎం జ్ఞానశేఖర్, మనోజ్‌కుమార్, వారి సిబ్బంది శీనయ్య, ఎస్ కిషన్, ఎన్ గిరిబాబు, జే రజని, అంకమ్మ వారం రోజుల్లో 24 కిలోల గంజాయిని పట్టుకున్నారని తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

చంద్రగిరి: మండలంలోని మల్లయ్యపల్లి వద్ద చెట్టును కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం .. మదనపల్లికి చెందిన అమల స్నేహితులతో కలిసి ఆదివారం మండలంలోని గంగుడుపల్లి సమీపంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో మల్లయ్యపల్లి వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. అమల, నిహారిక గాయపడ్డారు.

పోలింగ్ శాతంపై దృష్టి


నాగలాపురంలో నాయకులు, కార్యకర్తలకు సూచనలిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ శాతంపై దృష్టి పెట్టి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం నాగలాపురం మార్కెట్ యార్డ్‌లో ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణపై స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది ఓటు హక్కును వినియేగించుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాగలాపురం మండల కన్వీనర్ అపరంజిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ మోహన్ మొదలి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ఎస్ఎం సురేష్, నాయకులు చిన్నదొరై, ఉదయ రెడ్డి, కిరణ్‌కుమార్, ఆనంద్, మురళీ రెడ్డి, శ్రీనివాసులు,మహేష్, విజయ్‌కుమార్, దేశప్పన్ పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏనుగుల బీభత్సం - పూరిగుడిసె ధ్వంసం


ఏనుగులు ధ్వంసం చేసిన పూరి గుడిసెను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

పెద్దపంజాణి: మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పెద్దకాప్పల్లి పంచాయతీలోని పెద్దకాప్పల్లి, ముదిరెడ్డిపల్లి, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లి, ఆకులవారిపల్లి, కొత్త బూరగపల్లి, జిట్టంవారిపల్లి, బందార్లపల్లి రైతుల పొలాల్లోకి ఏనుగుల గుంపు పదే పదే చొరబడుతూ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. పేటూరు ఫారెస్టు బీటు నుంచి శనివారం రాత్రి వచ్చిన నాలుగు ఏనుగులు బందార్లపల్లి అటవీ ప్రాంత సమీపంలోని యానాది క్రిష్ణప్ప నివసిస్తున్న పూరి గుడిసెను ధ్వంసం చేశాయి. అందులోని ధాన్యాన్ని పూర్తిగా తినేశాయి. గుడిసెలోని ఇతర సామగ్రిని తొక్కి నాశనం చేశాయి. ఈ క్రమంలో ఏనుగుల శబ్దం విన్న క్రిష్ణప్ప కుటుంబీకులు అక్కడి నుంచి బందార్లపల్లెలోకి పరుగులు తీశారు. ఈ దాడిలో సుమారు రూ.50 వేల మేరకు నష్టం జరిగినట్టు అంచనా వేశారు. సమాచారం అందుకున్న రాయలపేట, చారాల బీట్ ఆఫీసర్లు రవికుమార్, దొరస్వామి ఆదివారం ఏనుగులు ధ్వంసం చేసిన పూరి గుడిసెను పరిశీలించారు. తమ వంతు తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి ఉచితంగా బియ్యాన్ని అందజేశారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపించి పరిహారం మంజూరుకు చర్యలు చేపడతామని తెలిపారు. ట్రాకర్ల సహాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న కారు..నలుగురికి గాయాలు

చంద్రగిరి: వాటర్ ట్యాంకర్‌ను కారు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయాలపాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ముంగళిపట్టు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, గుంటూరుకు చెందిన కృష్ణ చైతన్య కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు కారులో ఆదివారం తెల్లవారుజామున తిరుపతికి పయనమయ్యారు. ముందుగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకుని తిరుపతికి బయల్దేరారు. ముంగళిపట్టు వద్ద వస్తున్న క్రమంలో జాతీయ రహదారి డివైడర్‌పై వాటర్ ట్యాంకు ద్వారా నీళ్లు పడుతున్న సిబ్బంది ఎటువంటి సూచిక సిగ్నల్స్‌ను ఇవ్వక పోవడంతో, వెనుక నుంచి ట్యాంకర్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణ చైతన్యతోపాటు ఆయన భార్య సంధ్య, పిల్లలు శ్రీనిధి, ప్రణవి గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.